డబుల్‌ బెడ్రూమ్‌ లబ్ధిదారులకు న్యాయం చేయండి


వజ్రేష్‌యాదవ్‌తో చీర్యాల గ్రామస్తులు

కీసర: గత ప్రభుత్వ హయాంలో డబుల్‌బెడ్రూమ్‌ ఇళ్ల కేటాయింపులో అన్యాయం జరిగిందని చీర్యాల గ్రామస్తులు ఆరోపించారు. ఎలాంటి నిబంధనలు పాటించకుండా డ్రా పద్ధతిలో ఇళ్లు కేటాయించడంతో నిజమైన 20 మంది లబ్ధిదారులకు అన్యాయం జరిగిందన్నారు. వారికి న్యాయం చేయాలని ఆదివారం వారు టీపీసీసీ ఉపాధ్యక్షుడు తోటకూర వజ్రేష్‌యాదవ్‌ను కలిశారు. గ్రామంలో విచారణ చేపట్టి అసలైన లబ్ధిదారులకు న్యాయం జరిగేలా చూడాలని అప్పటి వరకు ఇళ్ల పట్టాలు ఎవ్వరికి పంపిణీ చేయొద్దని కోరారు. సానుకూలంగా స్పందించిన ఆయన త్వరలో అధికారులతో పూర్తిస్థాయిలో విచారణ చేపట్టి న్యాయం చేస్తానన్నారు.

అంబేడ్కర్‌ ఆశయసాధనకు కృషి చేయాలి


కీసరలో అంబేడ్కర్‌ విగ్రహానికి నివాళులర్పిస్తున్న దృశ్యం

కీసర: డా. బీఆర్‌ అంబేడ్కర్‌ చూపిన బాటలో ప్రతి ఒక్కరూ పయనించాలని రాష్ట్ర మున్నూరు కాపు సంఘం ప్రధాన కార్యదర్శి వేల్పుల శ్రీనివాస్‌గౌడ్‌ అన్నారు. ఆదివారం కీసరలో ప్రతివారం అంబేడ్కర్‌ విగ్రహానికి 'జ్ఞానమాల సమర్పణ' లో భాగంగా నిర్వహించిన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలల్లో 10/10 ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులకు తన వంతు ప్రోత్సాహాన్ని ఇస్తున్నట్లు తెలిపారు. అంబేడ్కర్‌ సంఘం అధ్యక్షుడు కొమ్ము సుదర్శన్‌, ప్రధాన కార్యదర్శి తుడుం శ్రీనివాస్‌, నేతలు కోలబాల్‌రాజ్‌, నల్లవెంకట్‌రెడ్డి, కట్టశంకరయ్య, సుధాకర్‌, బాల్‌రాజ్‌, గణేష్‌, రమేష్‌, రాజలింగం, చిత్తారి, నర్సింహ్మ, మోహన్‌ తదితరులు పాల్గొన్నారు.

హింసకు వ్యతిరేకంగా ఉద్యమిద్దాం

మేడ్చల్‌: హింసకు వ్యతిరేకంగా మహిళలు ఉద్యమించాలని, ఐద్వా జిల్లా కార్యదర్శి వినోద అన్నారు. మేడ్చల్‌లో ఆమె ఆదివారం మాట్లాడుతూ.. సమాజంలో సగమైన మహిళలు అన్ని రంగాల్లో రాణిస్తున్నప్పటికీ పని ప్రదేశాల్లో భద్రత కరువైందన్నారు. చిన్న పిల్లల నుంచి వృద్ధుల వరకు అత్యాచారాలు, అఘాయిత్యాలకు గురవుతున్నారన్నారు. రోజురోజుకు దాడులు పెరుగుతుండటంతో మహిళలు హింసకు వ్యతిరేకంగా ఉద్యమించాల్సిన అవసరం ఉందన్నారు. ప్రభుత్వంలో పార్టీ ఎన్నికలకు ముందు మహిళలకు ఇచ్చిన ఆరు గ్యారంటీలలో మహిళల అన్ని అంశాలను నేరవేర్చాలని డిమాండ్‌ చేశారు.

మండల ఐద్వా కమిటీ..

మండల ఐద్వా అధ్యక్షులుగా గౌతమి, ప్రధాన కార్యదర్శిగా అశ్విని, కోశాధికారిగా శ్రావణి, ఉపాధ్యక్షులుగా లత, సహాయ కార్యదర్శిగా జ్యోతి, సభ్యులుగా పల్లవి, డాలి,స్వరూప, బాలమణి, భాషమ్మ, లూదియలను ఎన్నుకున్నారు.

దళితుల హక్కుల సాధనకు అంబేడ్కర్‌ కృషి


ఘట్‌కేసర్‌లో అంబేడ్కర్‌ విగ్రహానికి నివాళులర్పిస్తున్న దృశ్యం

ఘట్‌కేసర్‌: అంబేడ్కర్‌ దేశంలోని దళితుల హక్కుల కోసం ఉద్యమించారని 'టైల్స్‌ లేయింగ్‌ వర్కర్స్‌ అసోసియేషన్‌' మండల అధ్యక్ష, ఉపాధ్యక్షుడు లింగయ్య, రాము అన్నారు. అంబేడ్కర్‌ ఆలోచన విధానాలను ప్రజల్లోకి తీసుకెళ్లడానికి అరుణ్‌కుమార్‌ ఆధ్వర్యంలో ఆదివారం అంబేడ్కర్‌ విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. వారు మాట్లాడుతూ.. అంబేడ్కర్‌ దళిత కుటుంబంలో జన్మించి జీవితాంతం వివక్ష, కష్టాలను ఎదుర్కొన్నాడని, ఇదే సామాజిక సమానత్వం, సమన్యాయం కోసం పనిచేయడానికి ప్రేరణ లభించిందన్నారు. అంబేడ్కర్‌ ఆలోచనల విధానాల ద్వారా ముందుకెళ్లాలని సూచించారు. దాసు, నర్సింగ్‌రావు, రాందాసు, సత్యం, వెంకటేశ్వర్లు, అంజయ్య, గణేశ్‌గౌడ్‌, శ్రీనివాస్‌, కృష్ణంరాజు, రాజేశ్‌కుమార్‌, సాయిలు, సాయికుమార్‌, విష్ణు, సచిన్‌ పాల్గొన్నారు.

గ్రూప్‌-2 పరీక్షలు ప్రశాంతం


సంస్కృతి ఇంజినీరింగ్‌ కళాశాల వద్ద ఏసీపీ, ఇన్‌స్పెక్టర్‌, ఎస్సైలు

ఘట్‌కేసర్‌: గ్రూపు- 2 పోస్టుల భర్తీ కోసం ప్రభుత్వం ఆదివారం నిర్వహించిన పరీక్షలు ప్రశాంతంగా ముగిశాయి. మున్సిపాలిటీలో 6 కేంద్రాల్లో 6408 మంది అభ్యర్థులను కేటాయించారు. ఆలస్యంగా వచ్చిన వారిని పరీక్ష కేంద్రంలోకి అనుమతించలేదు. 2,750 మంది అభ్యర్థులు హాజరు కాగా.. 3,658 మంది గైర్హాజరయ్యారు. సంస్కృతి, విజ్ఞాన భారతి, మెగా, కొమ్మూరి ప్రతాపరెడ్డి, అరోరా, ఏసీఈ కళాశాలలో ఏర్పాటు చేసిన పరీక్ష కేంద్రాల వద్ద సీఐ పరుశురాం బందోబస్తు ఏర్పాటు చేశారు. ఏసీపీ చక్రపాణి ఆయా కేంద్రాలను సందర్శించారు. ఎస్సైలు ప్రభాకర్‌రెడ్డి, నరసింహ, శేఖర్‌, శ్రీకాంత్‌ పాల్గొన్నారు.

తైక్వాండోలో విద్యార్థుల ప్రతిభ



మేడ్చల్‌: పట్టణంలోని కేఎల్‌ఆర్‌ వెంచర్‌లో ఆదివారం నిర్వహించిన కార్యక్రమంలో విద్యార్థులకు తైక్వాండో బెల్టులు ప్రదానం చేశారు. కేఎల్‌ఆర్‌ కాలనీ అధ్యక్షుడు నరేందర్‌ కార్యక్రమానికి హాజరై శిక్షణ పొందిన విద్యార్థులకు తైక్వాండో బెల్టులను అందజేశారు. త్వైక్వాండోలో శిక్షణ పొందిన 100 మంది విద్యార్థులు ప్రదర్శనలు ఇచ్చి తాము నేర్చుకున్న విద్యను ప్రదర్శించారు.

పోచమ్మ ఆలయ వార్షికోత్సవం


ప్రత్యేక పూజల్లో మేయర్‌ అజయ్‌యాదవ్‌

బోడుప్పల్‌: నగర పాలక సంస్థ పరిధిలోని 21వ డివిజన్‌లో ఈస్ట్‌ బాలాజీహిల్స్‌ కాలనీలోని శ్రీ పోచమ్మ అమ్మవారి ఆలయం 5వ వార్షికోత్సవ వేడుకలకు బోడుప్పల్‌ మేయర్‌ తోటకూర అజయ్‌యాదవ్‌, డిప్యూటీ మేయర్‌ కొత్త స్రవంతి కిశోర్‌గౌడ్‌ హాజరై ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఆలయాలు ప్రశాంతతకు నిలయాలుగా ఉండాలని సూచించారు. కార్పొరేటర్లు పోగుల నర్సింహారెడ్డి, సుమన్‌నాయక్‌, కొత్త చందర్‌గౌడ్‌, బొమ్మక్‌ కళ్యాణ్‌కుమార్‌, కో - ఆప్షన్‌ సభ్యులు రంగ బ్రహ్మన్నగౌడ్‌ తదితరులు పాల్గొన్నారు.

'పది'పై స్పెషల్‌ ఫోకస్‌

- వంద శాతం లక్ష్యంగా ప్రత్యేక తరగతులు
- ప్రతిరోజూ ఇంటివద్దే విద్యార్థులు చదివేలా ప్రణాళిక
- 108 ప్రభుత్వ పాఠశాలల్లో 8 వేల మంది విద్యార్థులు


ప్రత్యేక గ్రూపులుగా సబ్జెక్ట్‌పై చర్చించుకుంటూ..

సాక్షి,సిటీబ్యూరో: ప్రభుత్వ బడుల్లో పదోతరగతి చదువుతున్న విద్యార్థులపై విద్యాశాఖ స్పెషల్‌ ఫోకస్‌ పెడుతోంది. కార్పొరేట్‌, ప్రైవేట్‌ పాఠశాలల్లో చదువుకుంటున్న విద్యార్థులకు దీటుగా సర్కారు బడుల్లోని విద్యార్థులు పోటీ పడేలా ప్రత్యేక కార్యాచరణ రూపొందించింది.

వేకువజామునే పుస్తక పఠనం..

అక్టోబర్‌ నుంచి పదోతరగతి విద్యార్థులకు ప్రత్యేక తరగతులను నిర్వహిస్తున్న విద్యాశాఖ డిసెంబర్‌ నుంచి ఇంటి వద్ద విద్యార్థులు చదువుకునేలా ఉపాధ్యాయులతో మానిటరింగ్‌ చేస్తుంది. ప్రతి రోజూ వేకువజామునే విద్యార్థులు నిద్రలేచి పుస్తక పఠనం చేసేలా చర్యలు తీసుకుంటోంది.

విద్యార్థుల శ్రద్ధపై సమీక్ష..

వారంలో ఒకటి, రెండుసార్లు తల్లిదండ్రులతో టీచర్లు ఫోన్‌లో తమ పిల్లల చదువుపై చూపుతున్న శ్రద్ధను తెలుసుకుంటూనే వెనుకబడిన సబ్జెక్టుల్లో సాధించిన ప్రగతిని పేర్కొంటున్నారు. దీంతో తల్లిదండ్రులు కూడా తమ పిల్లల చదువుపై మరింత దృష్టి సారించేలా చర్యలు తీసుకుంటున్నారు.

వసతుల కల్పనపై చర్యలు..

ప్రభుత్వ పాఠశాలల్లో వసతులను పెంచడంతో పాటు కార్పొరేట్‌, ప్రైవేట్‌ స్కూళ్లకు దీటుగా తీర్చిదిద్దుతున్నారు. 'మన బడి-మన ఊరు- మన బస్తీ' కార్యక్రమం కింద గత ప్రభుత్వం జిల్లాలో 176 పాఠశాలల్లో అదనపు గదుల నిర్మాణంతో పాటు మౌలిక సదుపాయాలను కల్పించింది.

- అమ్మ ఆదర్శ పాఠశాలల కార్యక్రమం కింద కాంగ్రెస్‌ ప్రభుత్వం కమిటీలతో 286 పాఠశాలల్లో రూ.12.01 కోట్లతో 699 మరమ్మతులు, అభివృద్ధి పనులను చేపట్టింది. ప్రభుత్వ బడుల్లో ఇంగ్లిష్‌ మీడియాన్ని ప్రవేశపెట్టిన ప్రభుత్వం విద్యా సంవత్సరం ప్రారంభంలోనే పాఠ్యపుస్తకాలు, ఏకరూప దుస్తులను విద్యార్థులకు అందజేస్తున్నారు. నాణ్యమైన మధ్యాహ్న భోజనం, వసతి కల్పిస్తున్నారు.

'మేడ్చల్‌ బడి'కి ఆదరణ..

'మేడ్చల్‌ బడి' యాప్‌తో రూపొందించిన అన్ని తరగతుల పాఠ్యాంశాలతో విద్యార్థులకు నిర్వహించిన ఆన్‌లైన్‌ క్లాసులు రాష్ట్ర స్థాయిలో మంచి ఆదరణ లభించింది. జిల్లా విద్యాశాఖ ప్రత్యేక కార్యాచరణతో చేపట్టిన పుస్తక పఠనం'(రీడింగ్‌ క్యాంపెయిన్‌) కూడా విద్యార్థులు సెల్‌ఫోన్ల నుంచి కొంత మేరకు దూరమయ్యేలా... వైదొలిగేలా చేసింది. మేడ్చల్‌ జిల్లాలో ఏ జిల్లాలో లేని విధంగా 507 ప్రభుత్వ పాఠశాలల్లో 1.07 లక్షల మంది విద్యార్థులు చదువుకుంటున్నారు. 108 ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో 8 వేల మంది పదో తరగతి విద్యార్థులు ఉన్నారు. ఇటీవల ప్రభుత్వం నిర్వహించిన డీఎస్సీ-2024లో ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ పోస్టులు భర్తీ చేశారు.

వెనుకబడిన సబ్జెక్టుల్లో స్పెషల్‌ క్లాసులు..

మేడ్చల్‌ జిల్లాలో గతంలో పదో తరగతి విద్యార్థుల్లో ఎక్కువ మంది ఫెయిల్‌ అయినట్లు భావిస్తున్న గణితం, ఇంగ్లిష్‌, సామాన్యశాస్త్రం సబ్జెక్టుల్లో ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నారు.

ఇంటి వద్దే చదువుకునేలా చర్యలు..



పదో తరగతిలో వెనుకబడిన విద్యార్థులకు సబ్జెక్టుల వారీగా ప్రత్యేక తరగతులను నిర్వహిస్తున్నాం. ఇంటి వద్ద కూడా వేకువజామున విద్యార్థులు చదువుకునేలా టీచర్లు మానిటరింగ్‌ చేస్తున్నారు. ప్రైవేట్‌ స్కూళ్ల పైనా దృష్టి పెట్టాం. వందశాతం ఉత్తీర్ణతే లక్ష్యంగా నోట్స్‌ తయారు చేసి ఇస్తున్నాం.

– విజయకుమారి, డీఈఓ, మేడ్చల్‌జిల్లా


పుస్తక పఠనం చేస్తున్న విద్యార్థులు

మజిల్‌ మేనియా ఆసియా ఫైనల్‌కు శంకర్‌సింగ్‌


మెడల్‌తో శంకర్‌సింగ్‌

మేడ్చల్‌ : మేడ్చల్‌లోని ఎక్స్‌ట్రీమ్‌ కోచ్‌ శంకర్‌సింగ్‌ మజిల్‌ మేనియా ఆసియా ఫైనల్‌ పోటీలకు అర్హత సాధించాడు. గతంలో ఆయన హైదరాబాద్‌ మజిల్‌ మేనియా, ఇండియా మజిల్‌ మేనియా పోటీల్లో పాల్గొని మొదటి స్థానంలో నిలిచారు. ఆయన ఒకే ఏడాదిలో ఐసీఎన్‌ పోటీల్లో బంగారు, కాంస్యం, రజతం పతకాలను కై వసం చేసుకున్నారు.

మురుగు.. పరుగు


రోడ్డుపై ప్రవహిస్తున్న మురుగు

మేడ్చల్‌: మేడ్చల్‌ కిష్టాపూర్‌ రోడ్డులో కెలార్‌ వెంచర్‌ కమాన్‌ వాగు మధ్యలో మురుగు నీరు రోడ్డుపై ప్రవహిస్తోంది. దీంతో వాహనదారులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. మున్సిపల్‌ అధికారులు తాత్కాలికంగా మరమ్మత్తులు చేపడుతున్నారని, శాశ్వత పరిష్కారం చూపాలని ప్రజలు కోరుతున్నారు.

ముగిసిన వేంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలు



అల్వాల్‌: ఓల్డ్‌ అల్వాల్‌లోని బాలాజీ వేంకటేశ్వరస్వామి దేవాలయ బ్రహ్మోత్సవాలు ముగిశాయి. ఆదివారం ఉదయం ప్రత్యేక హోమం, మహా పూర్ణాహుతి అనంతరం ఆలయ కోనేటిలో చక్రస్నానం చేశారు. ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

వ్యాయామంతో ఆరోగ్యకరమైన జీవనం


జిమ్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి

కీసర: ప్రతిరోజూ వ్యాయామం చేసిన వారు ఆరోగ్యకరమైన జీవనం గడుపుతారని మేడ్చల్‌ ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి అన్నారు. ఆదివారం రాత్రి నాగారం మున్సిపాలిటీ పరిధిలో నూతనంగా ఏర్పాటు చేసిన అభి ఫిట్నెస్‌ స్టూడియో జిమ్‌ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మనిషి తన జీవితంలో ప్రతిరోజు వ్యాయామం ఒక భాగం చేసుకోవాలని అప్పుడే ఎలాంటి రోగాలు రావని చెప్పారు. కొద్దిసేపు మల్లారెడ్డి జిమ్‌ చేసి అందరిని ఉత్సాహపరిచారు. మున్సిపల్‌ చైర్మన్‌ కౌకుట్ల చంద్రారెడ్డి, వైస్‌ చైర్మన్‌ బండారి మల్లేష్‌యాదవ్‌, కౌన్సిలర్లు తదితరులు పాల్గొన్నారు.

సర్దార్‌ పటేల్‌కు ఘన నివాళి


నివాళులర్పిస్తున్న కాంగ్రెస్‌ నేతలు


సర్దార్‌ పటేల్‌ విగ్రహానికి నివాళులర్పిస్తున్న బీజేపీ నేతలు

మేడ్చల్‌: రాజరిక సంస్థానాలను విలీనం చేసి అఖండ భారత్‌ నిర్మాణానికి పునాదులువేసిన మహనాయకుడు సర్దార్‌ వల్లభాయ్‌ పటేల్‌ అని, రాష్ట్ర కాంగ్రెస్‌ నాయకుడు సురేందర్‌ముదిరాజ్‌ అన్నారు. సర్దార్‌ వల్లభాయ్‌పటేల్‌ వర్ధంతి సందర్భంగా మండలంలోని గౌడవెల్లిలో ఆయన విగ్రహానికి కాంగ్రెస్‌ నేతలతో కలిసి నివాళులర్పించారు. అఖండ భారత్‌ నిర్మాణం సర్దార్‌ వల్లభాయ్‌ పటేల్‌ వల్లే జరిగిందన్నారు. కాంగ్రెస్‌ నేతలు వినోద్‌గౌడ్‌, రాజుగౌడ్‌ తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ ఆధ్వర్యంలో..

మేడ్చల్‌: ఉక్కు మనిషి సర్దార్‌ వల్లభాయ్‌ పటేల్‌ వర్ధంతిని మేడ్చల్‌లో వివిధ పార్టీల నాయకులు నిర్వహించారు. పట్టణంలోని 4వ వార్డులోని కిష్టాపూర్‌ అర్చనకాలనీలోని పటేల్‌ విగ్రహానికి పూలమాలలు నివాళులర్పించారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు విక్రంరెడ్డి, నాయకులు ఆంజనేయులు, ప్రేమ్‌దాస్‌ అర్చన కాలనీవాసులు తదితరులు పాల్గొన్నారు.

హనుమాన్‌ నమూనా విగ్రహావిష్కరణ


ప్రత్యేక పూజల్లో పాల్గొన్న కుషాయిగూడ వాసులు

కుషాయిగూడ: కుషాయిగూడ బస్టాండ్‌ ఆవరణలో హనుమాన్‌ విగ్రహ నిర్మాణ సమితి, బజ్‌రంగ్‌దళ్‌ ఆధ్వర్యంలో 36 అడుగుల భారీ హనుమాన్‌ నమూనా విగ్రహాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆదివారం హనుమాన్‌ విగ్రహానికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. 36 అడుగుల విగ్రహ రూపకల్పన పనులు మొదలైనట్లు నిర్మాణ సమితి ప్రతినిధులు ప్రకటించారు. మాజీ కార్పొరేటర్‌ సింగిరెడ్డి ధన్‌పాల్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, శివకుమార్‌గౌడ్‌, చక్రపాణిగౌడ్‌, చల్ల ప్రభాకర్‌, అశోక్‌చారి, హనుమంతు, ఆనంద్‌గౌడ్‌, వెంకులు, అనిల్‌ ముదిరాజ్‌, విజయ్‌, రవి పాల్గొన్నారు.

అలరించిన కూచిపూడి నృత్య ప్రదర్శన



ఉప్పల్‌: ఉప్పల్‌ మినీ శిల్పారామంలో ఆదివారం నిర్వహించిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. శివ సంకల్ప స్కూల్‌ ఆఫ్‌ డాన్స్‌ ఆధ్వర్యంలో నిర్వహించిన కూచిపూడి నృత్య ప్రదర్శన ఎంతగానో ఆకట్టుకుంది. ఈ కార్యక్రమంలో కళాకారులు తదితరులు పాల్గొన్నారు.

సీఎం రిలీఫ్‌ ఫండ్‌ చెక్కుల పంపిణీ


లబ్ధిదారులకు చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్యే మల్లారెడ్డి

ఘట్‌కేసర్‌: సీఎంఆర్‌ఎఫ్‌ పేదల ఆరోగ్యానికి అండగా నిలుస్తుందని ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి అన్నారు. అనారోగ్యంతో ఆసుపత్రిలో చికిత్స పొందిన ఎదులాబాద్‌ గ్రామానికి చెందిన లింగయ్యకు రూ.49,500లు, రాజుకు రూ. 58,500లు సీఎంఆర్‌ఎఫ్‌ నుంచి మంజూరు కాగా.. ఆదివారం చెక్కులను అందజేశారు. బీఆర్‌ఎస్‌ గ్రామశాఖ అధ్యక్షుడు శంకర్‌, నాయకుడు శ్రీనివాస్‌, లబ్ధిదారులు పాల్గొన్నారు.

రైల్వే వంతెన పనులు పూర్తి చేయించాలని..

15 రోజులకు చేరిన రిలే నిరాహార దీక్షలు


సంఘీభావం తెలుపుతున్న మాజీ ఎంపీపీ సుదర్శన్‌రెడ్డి, డైరెక్టర్‌ లక్ష్మారెడ్డి

ఘట్‌కేసర్‌: రైల్వే వంతెన పనులు పూర్తి చేయించి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని కోరుతూ జేఏసీ ఆధ్వర్యంలో రిలే నిరాహార దీక్షలు ఆదివారంతో 15 రోజులకు చేరుకుంది. ఈ సందర్భంగా జేఏసీ చైర్మన్‌ లక్ష్మారెడ్డి, మాజీ ఎంపీపీ సుదర్శన్‌రెడ్డి, ఎఫ్‌ఎస్‌సీఎస్‌ చైర్మన్‌ రాంరెడ్డి, డైరెక్టర్‌ రేసు లక్ష్మారెడ్డి, మాజీ చైర్మన్‌ శ్రీనివాస్‌గౌడ్‌, ఆర్యవైశ్య సంఘం నాయకులు వీరేశ్‌గుప్తా, చంద్రశేఖర్‌గుప్తా, సుధాకర్‌గుప్తా, చంద్రశేఖర్‌గౌడ్‌, విశ్రాంత హెచ్‌ఎం. మారయ్యగుప్తా సంఘీభావం ప్రకటించారు. అనంతరం దీక్షలు చేపట్టిన వారికి నిమ్మరసం అందజేసి విరమింపజేశారు. శ్రీనివాస్‌రెడ్డి, నజీర్‌ ఇతర నేతలు పాల్గొన్నారు.

షార్ట్‌ సర్క్యూట్‌తో అగ్నిప్రమాదం

రూ.10 లక్షల మేర ఆస్తినష్టం



శామీర్‌పేట్‌: షార్ట్‌ సర్క్యూట్‌ కారణంగా ఉప్పరిపల్లిలోని ఓ గోదామ్‌లో అగ్నిప్రమాదం చోటు చేసుకున్న ఘటన ఆదివారం శామీర్‌పేట పోలీస్‌స్టేషన్‌ పరిధిలో జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. తూంకుంట మున్సిపాలిటీ ఉప్పరిపల్లిలోని ఆర్‌కే. ఈవెంట్స్‌ (డెకరేషన్‌ సామగ్రి) గోదామ్‌లో ఆదివారం షార్ట్‌ సర్క్యూట్‌తో అకస్మాత్తుగా మంటలు చెలరేగాయి. గమనించిన స్థానికులు అగ్నిమాపక సిబ్బందికి సమాచారం ఇవ్వగా.. వారు ఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపులోకి తీసుకొచ్చారు. ఈ ప్రమాదంలో సుమారు రూ.10 లక్షల మేర ఆస్తినష్టం జరిగిందని బాధితులు తెలిపారు.

నాట్య ప్రదర్శనలో విద్యార్థిని ప్రతిభ


వైసిరెడ్డికి జ్ఞాపికను అందజేస్తున్న ఎస్పీ భారతి

కీసర: నగరంలోని బీఎం బిర్లా సైన్స్‌ సెంటర్‌లో ఆదివారం విజయమాధవి సేవా సాంస్కృతిక అకాడమీ ఆధ్వర్యంలో నిర్వహించిన నాట్య ప్రదర్శనలో కీసరకు చెందిన నల్ల వైసిరెడ్డి తన నాట్య ప్రదర్శనతో అందరిని ఆకట్టుకున్నారు. కేంద్ర ప్రభుత్వ సంగీత నాటక్‌ అకాడమీ సభ్యురాలు డా. ఎస్పీ భారతి చేతుల మీదుగా జ్ఞాపిక, ప్రశంసాపత్రాన్ని అందుకున్నారు.

ఘనంగా అయ్యప్ప పడిపూజ


మండల పూజలో పాల్గొన్న చైర్మన్‌ కొండల్‌రెడ్డి

పోచారం: అన్నోజిగూడలోని అయ్యప్పస్వామి ఆలయంలో ఆదివారం మండల పూజ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిథిగా చైర్మన్‌ కొండల్‌రెడ్డి పాల్గొని ఆయన మాట్లాడుతూ.. సనాతన ధర్మ పరిరక్షణలో అందరూ భాగస్వాములు కావాలని హితవు పలికారు. అనంతరం అన్నప్రసాద వితరణ చేశారు. నాయకులు శివాజీముదిరాజ్‌, జితేందర్‌నాయక్‌, కేఎం రెడ్డి, బాల్‌రెడ్డి, దేవ్‌సింగ్‌, ఆనంద్‌ తదితరులు పాల్గొన్నారు.

వధూవరుల పరిచయ వేదిక

కాప్రా: ఏఎస్‌రావునగర్‌ డివిజన్‌ కమలానగర్‌ వెల్ఫేర్‌ అసోసియేషన్‌ కమ్యూనిటీ హాల్‌లో భవానీ వివాహ వేదిక ఆధ్వర్యంలో పరిచయ పుస్తకం ఆవిష్కరించారు. ఆదివారం మాజీ కార్పొరేటర్‌ కొత్త రామారావు సమక్షంలో సమావేశం నిర్వహించి, కాపు కులస్తుల వధు,వరులకు పరిచయ కార్యక్రమం నిర్వహించారు. దాదాపు 300 మందికి పైగా హాజరైనట్లు వివరించారు.

బాలిక అదృశ్యం

కుషాయిగూడ: ఓ బాలిక అదృశ్యమైన ఘటన ఆదివారం చర్లపల్లి పోలీస్‌స్టేషన్‌ పరిధిలో చోటు చేసుకుంది. ఇన్‌స్పెక్టర్‌ రవికుమార్‌ తెలిపిన వివరాల ప్రకారం.. ఉత్తర్‌ప్రదేశ్‌కు చెందిన కుటుంబం బతుకుదెరువు కోసం హైదరాబాద్‌కు వచ్చి చర్లపల్లి భరత్‌నగర్‌లో నివాసం ఉంటున్నారు. గతనెల 25న వారి కుమార్తె కనిపించకుండా పోయింది. చుట్టుపక్కల వెతికినా ఆచూకీ లభించకపోవడంతో బాలిక తల్లిదండ్రులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.